సాక్షి
ఒడిశా

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 5,22,869
బంగారం: 20 మిల్లీ గ్రాములు
వెండి: 159 గ్రాముల 900 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



సుభద్ర యోజనపై ప్రచారం

మహిళల ఆర్థిక సాధికారతకు అమలు చేయనున్న 'సుభద్ర యోజన'పై విస్తృత ప్రచారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

– 8లో



ఆనందోత్సాహాలతో నువాఖాయ్

పశ్చిమ ఒడిశా ప్రజలు అత్యంత సందడిగా జరుపుకొనే పండగల్లో ఒకటైన నువాఖాయిలో సీఎం మోహన్‌చరణ్ మాఝి పాల్గొన్నారు.

– 8లో

న్యూస్‌రీల్

పథకాలు ప్రజల చెంతకు చేరాలి



మాట్లాడుతున్న మంత్రి జెన్నా

రాయగడ: ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు చేర్చాల్సిన బాధ్యత మనపై ఉందని రాష్ట్ర వాణిజ్య, గనుల శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెన్నా అన్నారు. ఆదివారం స్థానిక సిరిగుడలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. కొలువు దీరిన కొత్త ప్రభుత్వ పథకాలను ప్రజల దరికి చేరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, కాశీరాం మాఝి తదితరులు పాల్గొన్నారు.

రాధ మృతిపై మావోయిస్టుల ప్రకటన



మావోయిస్టులు విడుదల చేసిన లేఖ

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా బోర్డర్‌లో మావోయిస్టు బంటి రాధ అలియాస్ నీల్సో హత్యకు సంబంధించి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అనుబంధ శాఖ ఆంధ్రా–ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ లేఖ విడుదల చేశారు. రాధ విప్లవ ద్రోహానికి సంబంధించిన ఆడియో తమ వద్ద ఉందని పేర్కొన్నారు. ఆమె తమ్ముడి పాత్రపైనా వివరాలు ఉన్నాయని చెప్పారు. అయితే రాధ మృతిపై కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. ఆడియోలో కొంతభాగం మాత్రమే విడుదల చేస్తున్నామని, సైద్ధాంతిక ఉద్యమ రక్షణలో భాగంగా పూర్తి ఆడియో విడుదల చేయలేమని పేర్కొన్నారు.

అటవీ మంత్రి క్వార్టర్స్‌లోకి పాము



పామును పట్టుకున్న మల్లిక్

భువనేశ్వర్: రాజధానిలోని యూనిట్–6లో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి గణేష్ రాంసింగ్ ఖుంటియా ప్రభుత్వ క్వార్టర్స్‌లో పాము కలకలం సృష్టించింది. క్వార్టర్స్ సిబ్బంది తలుపు తెరవగా పెద్ద పాము కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. వెంటనే సమాచారం అందుకున్న స్నేక్ హెల్ప్ లైన్ ప్రధాన కార్యదర్శి సువేందు మల్లిక్ ఘటనా స్థలానికి చేరుకుని ఐదు అడుగుల పామును చాకచక్యంగా పట్టుకుని సదూర ప్రాంతంలో విడిచిపెట్టారు.

దూసుకొచ్చిన మృత్యువు



ట్రక్ కింద పడి మృతిచెందిన మైనర్లు

కొరాపుట్: ట్రక్ క్రింద పడి ఇద్దరు బాలురు మృతి చెందిన విషాద ఘటన కొరాపుట్ జిల్లా కేంద్రంలోని రైల్వే జంక్షన్ సమీపంలో బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. సినిమా హాల్ వెనుక వీధికి చెందిన ప్రియాంశు బెనియా(16), ఖరియాగుడకు చెందిన కృష్ణ పరాజ్ (16)లు పోలీస్ బ్యారక్ ప్రాంతం నుంచి బైక్‌పై కొరాపుట్ వస్తుండగా అదుపు తప్పి కొరాపుట్ నుంచి విశాఖ వైపు వెళ్తున్న ట్రక్ కిందకు దూసుకుపోయారు. తీవ్ర గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందారు. వెంటనే ట్రక్ డ్రైవర్ పరారయ్యాడు. దీంతో స్థానికులు ఆందోళనకు దిగగా.. పోలీసులు వచ్చి సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.


పిడుగుపాటుకు మహిళ బలి

రాయగడ: పిడుగు పాటుకు మహిళ మృతి చెందిన ఘటన కళ్యాణ సింగుపూర్ సమితి సింగారి పంచాయతీ ఖొరాజొడ గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. చండాల్ మహానందియా భార్య యమున (58) గ్రామ సమీపంలోని తన పొలం వద్ద పనులు చేసుకుంటున్న సమయంలో వర్షం కురవడంతో చెట్టు కింద నిల్చుంది. అదే సమయంలో పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

వచ్చాడయ్యో.. స్వామి..!



రాయగడ: న్యూకాలనీలో గణనాథుడు



రాయగడ: బుదరావలసలో 34 అడుగుల విగ్రహం



పర్లాకిమిడి: బోయివీధి వద్ద పిచ్చుకగూడులో విఘ్నేశ్వరుడు



పర్లాకిమిడి:తొమ్మిదో వార్డు అంకావీధిలో గణేశుడు




భువనేశ్వర్: దివాన్‌బజార్‌లో గణనాథుడి అలంకరణ



పర్లాకిమిడి: చీమలవీధిలో గణనాథుడు

విఘ్నాధిపతి, కోరిన కోర్కెలు తీర్చే గణనాథుడు వాడవాడలా కొలువుదీరాడు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా విభిన్న ఆకృతుల్లో గణేశుడు భక్తులకు దర్శనమిచ్చాడు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉండ్రాళ్లు, కుడుములను నైవేద్యంగా సమర్పించారు. పలుచోట్ల వినాయక మండపాలను యువత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. – సాక్షి నెట్‌వర్క్



మల్కన్‌గిరి: బస్టాండ్ వద్ద గణనాథుడు



భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లా బొడొచొణా మహా వినాయక పీఠంలో గణపతి శోభ



మల్కన్‌గిరి: కోరుకొండ సమితిలో వినాయకుడు



జయపురం: కెల్లా వీధిలో..



కొరాపుట్: నబరంగ్‌పూర్ గాంధీనగర్‌లో కొలువుదీరిన గణేశుడు



కొరాపుట్: మెయిన్‌రోడ్డులోని పోస్టాఫీసు సమీపంలో చిత్రాడ జోగారావు రూపొందించిన గణనాథుడు



జయపురం: భద్రయ్యవీధిలో..



జయపురం: మహారాణిపేటలో..

రాగల 24 గంటల్లో..

- ఉత్తర ఒడిశా వైపు తీవ్ర అల్ప పీడనం
- నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు



మల్కన్‌గిరి: రహదారిని ముంచెత్తిన వరద నీరు

ప్రాంతం	వర్షపాతం (మిల్లీ మీటర్లు)
గోపాలపురం	37.6
జాజ్‌పూర్	34.2
కొరాపుట్	32.2
టిట్లాగడ్	26.0
నువాపడా	25.4
మల్కన్‌గిరి	18.8
భద్రక్	18.0



జయపురం: బొయిపరిగుడలో నదిని దాటుతున్న స్థానికులు



జయపురం: కుంద్ర సమితిలో కూలిన ఇల్లు



మల్కన్‌గిరి: కూలిన మంగారాజ్ ఇంటి గోడ

భువనేశ్వర్/జయపురం/మల్కన్‌గిరి: పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం గంటకు 13 కిలోమీటర్ల వేగంతో ఉత్తర – వాయువ్య దిశగా కదులుతోంది. రానున్న 24 గంటల్లో ఇది తీవ్ర అల్ప పీడనంగా మారే అవకాశం ఉంది సోమవారం కళింగపట్నం (ఆంధ్రప్రదేశ్)కి తూర్పున 280 కిలోమీటర్ల దూరంలో, గోపాల్‌పూర్‌కు తూర్పు – ఆగ్నేయంగా 230 కిలోమీటర్ల దూరంలో, పారాదీప్‌కు దక్షిణ–ఆగ్నేయంగా 260 కిలో మీటర్లు, దిఘ (పశ్చిమ బెంగాల్)కి దక్షిణంగా 390 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంటుంది. ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల వైపు కదులుతూ సోమవారం సాయంత్రం గానీ, రాత్రి సమయంలో గానీ పశ్చిమ – వాయువ్య దిశగా కదిలి పూరీ–దిఘాల మధ్య తీరం దాటే అవకాశం ఉంది.

భారీ వర్షపాతం హెచ్చరిక..

బంగాళాఖాతంలో అల్ప పీడనం మార్పుల నేపథ్యంలో మంగళ వారం ఉదయం 8.30 గంటల వరకు భారత వాతావరణ కేంద్రం ఎరుపు హెచ్చరిక జారీ చేసింది. పూరీ, జగత్‌సింగ్‌పూర్, ఖుర్దా, కటక్, ఢెంకనాల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షపాతం (7 నుంచి 20 సెంటీ మీటర్లు), మారుమూల ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షపాతం (20 సెంటీ మీటర్లు పైబడి) కురిసే అవకాశం ఉంది. గంజాం, కొరాపుట్, కంధమల్, బొలంగీర్, బర్‌గడ్, బౌధ్, సోన్‌పూర్, జాజ్‌పూర్, కేంద్రాపడా, నయాగడ్, అంగుల్, సంబలపూర్ జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. నువాపడా, ఝార్సుగుడ, సుందర్‌గడ్, దేవ్‌గడ్, కెంజొహర్, మయూర్‌భంజ్, రాయగడ, గజపతి, మల్కన్‌గిరి, నవరంగ్‌పూర్, కలహండి, భద్ర, బాలాసోర్ జిల్లాల్లో 7 నుంచి 11 సెం.మీ. మేర వర్షపాతం నమోదయ్యే అవకాశముంది.

కొరాపుట్‌లో కుండపోత..

కొరాపుట్ జిల్లాలో కుండపోత వర్షాలు పడుతున్నాయి. జయపురం, బొయిపరిగుడ, కుంద్రలలో అత్యధిక వర్షపాతం నమోదైంది. బొయిపరిగుడలో రికార్డు స్థాయిలో 170 మిల్లీ మీటర్లు, జయపురంలో 120.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు గ్రామాల్లో ఇల్లు దెబ్బతిన్నాయి. లింబాగుడ, పూజారిగుడ, సువాగుడ, గౌడగుడ, గుంప గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. లిబగుడ వద్ద బిరి నది వంతెనపై రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది.

కూలిన ఇంటి గోడ..

మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి సోమనాథ్‌పూర్‌లో వర్షం ధాటికి ఇల్లు గోడ కూలిపోయింది. ఈ ఘటనలో మంగారాజ్‌తో పాటు భార్యా, కుమారుడికి గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను కుడుములగుమ్మా ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

బ్రహ్మపురికి వందేభారత్

- టాటానగర్–బరంపురం మధ్య సర్వీసు
- 15 నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు

భువనేశ్వర్: బ్రహ్మపురి వాసులకు తీపికబురు. అతి త్వరలో 2వ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయి. టాటానగర్, బరంపురం మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఈ నెలలోనే ప్రారంభం కానుంది. ట్రయల్ రన్ వంటి ముందస్తు కార్యకలాపాలు పూర్తయినట్లు సమాచారం. అన్నీ కలిసి వస్తే ఈ నెల 15 నుంచే బరంపురం – టాటా మధ్య కొత్త వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలెక్కే అవకాశముంది. రైలు రాకపోకలకు సంబంధించి ప్రతిపాదిత వేళలు, స్టాపేజీల ఆమోదం రైల్వే బోర్డు పరిశీలనలో ఉంది. కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు తూర్పు కోస్తా, ఆగ్నేయ రైల్వేని అనుసంధానపరుస్తుంది.

రాష్ట్రంలో ఇది నాలుగో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కానుంది. ప్రస్తుతం పూరీ – హౌరా, పూరీ – రౌర్కెలా, భువనేశ్వర్ – విశాఖపట్నం మధ్య మూడు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు పట్టాలపై పరుగులు తీస్తున్నాయి.

తరణి మాత క్షేత్రానికి రైలు సౌకర్యం..

బరంపురం, టాటా నగర్ మధ్య నడవనున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కెందుఝొరొగొడొ, జోడా, బర్బిల్ ప్రాంతాల గుండా పయనిస్తుంది. ఈ ప్రాంతాల ప్రజలు పొందబోతున్న మొదటి వందే భారత్ రైలు ఇదే అవుతుంది. హరిచందన్‌పూర్ స్టేషన్ మీదుగా ఘొటొగాంవ్‌లో ప్రసిద్ధ తరణి మాత క్షేత్రానికి ప్రజలు సౌకర్యవంతంగా చేరుకోవడానికి కూడా ఇది సహాయపడుతుంది.



వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

ప్రతిపాదిత వేళలు..

- 20891 టాటా నగర్ – బరంపురం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 5.20 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.30 గంటలకు బరంపురం గమ్యం చేరనుంది.
- 20892 బరంపురం – టాటానగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి రాత్రి 11.55 గంటలకు గమ్యం చేరనుంది.
- టాటానగర్, బరంపురం మధ్య 589 కిలో మీటర్ల దూరం. గంటకు సుమారు 66 కిలో మీటర్ల వేగంతో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పరుగులు తీస్తుంది. ఈ మార్గంలో అత్యంత వేగవంతమైన తొలి రైలు ఇదే కావడం విశేషం.

క్లుప్తంగా

జయపురం-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్!

భువనేశ్వర్: అవిభక్త కొరాపుట్ జిల్లా జయపురం నియోజకవర్గం నుంచి భువనేశ్వర్ ప్రాంతానికి డైరెక్ట్ రైలు సౌకర్యం ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపిందని రాష్ట్ర రవాణా, వాణిజ్య శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి ప్రశ్నకు సమాధానమిచ్చారు. జయపురం - కొరాపుట్ - కొత్తవలస - భువనేశ్వర్ మార్గంలో నిత్యం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు నడిపించాలనే ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వం (రైల్వే) పరిశీలనలో ఉందని వివరించారు.

జనరల్ స్టోర్‌లో చోరీ

రాయగడ: స్థానిక అరవిందనగర్ 2వ లైన్‌లోని జనరల్ స్టోర్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు గ్రిల్ విరగ్గొట్టి లోపలికి చొరబడి రూ.96 వేలు నగదు పట్టుకుపోయినట్లు బాధితుడు చిన్నారి రవి కుమార్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దుండగులు సీసీ కెమెరాను ముందుగా విరగ్గొట్టి హార్డ్ డిస్క్‌ను కూడా తీసుకెళ్లినట్లు గుర్తించారు.

ట్రక్ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు

మల్కన్‌గిరి: చిత్రకొండ ఘాట్ రోడ్డులో శనివారం ట్రక్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మల్కన్‌గిరి నుంచి బలిమెల చిత్రకొండ మీదుగా ఆంధ్రా వైపు వెళ్తున్న ట్రక్ టొనాల్ క్యాంప్ వద్ద ఘాటీ రోడ్డుపై అదుపు తప్పి బోల్తాపడింది. సమాచారం అందుకున్న బలిమెల ఐఐసీ ధీరజ్ పట్నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని స్పృహ తప్పిన డ్రైవర్‌ను స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డ్రైవర్ స్వస్థలం తమిళనాడుగా గుర్తించారు.

బీఈడీ పరీక్షల పేరిట మోసం

జయపురం: బీఈడీ పరీక్షల కౌన్సెలింగ్ సెంటర్ పేరిట తనను మోసం చేశారంటూ బొయిపరిగుడ మహుళి గ్రామానికి చెందిన సుబాష్ గదబ శనివారం జయపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కౌన్సెలింగ్ సెంటర్‌కు మూడు విడతలుగా రూ.50 వేలు చెల్లించానని, పరీక్ష కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో ఉందని హాల్ టికెట్ తర్వాత వస్తుందని చెప్పినట్లు పేర్కొన్నారు. నేరుగా కడప వెళ్లి పరిశీలించగా అక్కడ ఎటువంటి బీఈడీ కాలేజీ గానీ, పరీక్ష కేంద్రం గానీ లేదని చెప్పారు. ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఆర్‌తో నిలిచిన ప్రాణాలు



చిన్నప్పన్నకు సీపీఆర్ చేస్తున్న ఫిజియోథెరపిస్టు

కోటబొమ్మాళి: ఒక యువ ఫిజియోథెరపిస్టు సకాలంలో స్పందించడంతో నిండు ప్రాణం నిలిచింది. కోటబొమ్మాళి శివారులోని శ్రీనివాస నగర్‌లో చిన్న ప్పన్న కుటుంబం నివసిస్తోంది. శనివారం సాయంత్రం చిన్నప్పన్న బయటకు వెళ్లి ఇంటికి వచ్చి మంచంపై కుప్పకూలిపోయి అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. భార్య లక్ష్మీకళ ఎంత పిలిచినా పలకలేదు. శరీరమంతా చెమటలు పట్టి ఉన్నాయి. దీంతో ఆందోళనగా పక్కనే నివశిస్తున్న లఖిణాన శ్రీనివాసరావు కుమార్తె యువ ఫిజియోథెరపిస్టు సంధ్యారాణికి సమాచారం ఇవ్వగా ఆమె వచ్చి పరిశీలించారు. గుండె చప్పుడు వినిపించకపోవడం, శరరీమంతా చెమటలు పట్టి ఉండడంతో వెంటనే సీపీఆర్ చేశారు. కొద్ది నిమిషాల్లో చిన్నప్పన్న లేచి కూర్చున్నారు. చవితి వేళ ప్రాణాలు నిలబడడంతో కుటుంబమంతా సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు.

పిడుగుపాటుకు 6 గొర్రెలు మృతి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామంలో శనివారం కురిసిన వర్షాలకు గాను పిడుగు పడి 6 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల కాపరి సోడిమూడి నాగేష్ శనివారం మధ్యాహ్నం కల్లేపల్లి కళాక్షేత్రం పరిసర ప్రాంతంలో గల ఇసుక దిబ్బెల వద్ద గొర్రెలను మేపుతుండగా ఒక్కసారిగా పిడుగు పడడంతో ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఆరు గొర్రెలు చనిపోయాయి. ప్రస్తుతం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆనందోత్సాహాలతో నువాఖాయ్




- సమలేశ్వరి మాతకు నవాన్నం నివేదన
- వేడుకలకు హాజరైన సీఎం మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్: పశ్చిమ ఒడిశా ప్రజలు అత్యంత సందడిగా జరుపుకొనే పండగ నువాఖాయి. ఇక్కడి ప్రజలు ప్రధాన వ్యవసాయ పండుగగా భావిస్తారు. ఏటా గణపతి చతుర్థి మర్నాడు భాద్రపద మాసం పంచిమి తిథి నాడు ఈ పండగ జరుపుకొంటారు. కొత్త వడ్లు, కొత్త బియ్యం వంటకాల్ని ఆరాధ్య దేవత సమలేశ్వరికి నివేదించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది శుభ గడియలు ఆదివారం ఉదయం 9.12 నుంచి 09.27 గంటల మధ్య తొలుత సమలేశ్వరి మాత ప్రధాన అర్చక కుటుంబం నుంచి వచ్చిన నవాన్నం నివేదించారు. అనంతరం ఇతర అర్చకులు, ప్రజలు సమర్పించే నవాన్నం సమర్పించారు. నువాఖాయి వేడుకల్లో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ప్రత్యక్షంగా పాలుపంచుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ, ఆచార వ్యవహారాలలో సాటి భక్తజనంతో పాలుపంచుకుని అందరివాడిగా మరోసారి చాటుకున్నారు. మరోవైపు, సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగరతీరంలో సైకత శిల్పం రూపొందించి ప్రజలకు నువాఖాయ్ శుభాకాంక్షలు తెలియజేశారు.



సమలేశ్వరి మాత



పూరీ సాగర తీరంలో నువాఖాయ్ సైకత శిల్పం



నువాఖాయ్ వేడుక



నవాన్నం స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

బీజేపీలోకి బిభీషణ్ మాఝి!



మంత్రి జెన్నాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బిభీషణ్ మాఝి, మద్దతుదారులు

రాయగడ: కొరాపుట్, రాయగడ జిల్లాల్లోని లక్ష్మీపూర్ శాసనసభ బీజేడీ మాజీ ఎమ్మెల్యే బిభీషణ్‌మాఝి బీజేపీలోకి చేరనున్నట్లు సమాచారం. రాష్ట్ర వాణిజ్య, గనుల శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెన్నా శనివారం రాయగడ పర్యటనకు వచ్చిన సందర్భంగా మంత్రిని కలిసిన బిభీషణ్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. బీజేపీలోకి చేరేందుకు ఉత్సుకత చూపించడంతో మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలో రాజధాని భువనేశ్వర్‌లో చేరికల కార్యక్రమం ఉందని, అక్కడ అధిష్ఠానం సమక్షంలో చేరాలని మంత్రి సూచించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీ ఘోర పరాజయం పొందడంతో ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు బీజేపీలోకి క్యూకడుతున్నారు. ఈ క్రమంలో రాయగడ జిల్లాలోనూ ఇటువంటి పరిణామాలు చోటుచేసుకోవడంతో బీజేడ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందనేది రాజకీయ విశ్లేషకుల అంచనా.

ముఖ్యమంత్రితో యువరాణి భేటీ

పర్లాకిమిడి:

ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మఝిని గజపతి వంశీయురాలు కల్యాణీదేవి గజపతి భువనేశ్వర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెతో పాటు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోడూరు నారాయణరావు, మోహనా బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి ప్రసన్నకుమార్ మల్లిక్ వున్నారు. పర్లాకిమిడిలో నిర్మాణంలో ఉన్న జగన్నాథ మందిరానికి ప్రభుత్వ సాయం, గజపతి ప్యాలెస్ మరమ్మతుల విషయమై ముఖ్యమంత్రితో చర్చించినట్లు సమాచారం. కాగా, సోషల్ మీడియాలో వీరి భేటీ వైరల్ అవుతుండటంతో గజపతి జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.



సీఎం మోహన్ చరణ్ మఝితో కల్యాణీదేవి గజపతి

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



నుజ్జయిన కారు



గాయపడిన దమయంతి

రాయగడ: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఐదుగురు గాయాలపాలయ్యారు. ఇందులో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కొరాపుట్ జిల్లా బుంధుగాం పంచాయతీ కత్తులపేటకు చెందిన దమయంతి మినియాక, రస్మిత బెహర, ఎస్.చిరంజీవి, పింటుపండాలు రాయగడకు ఓ విందు భోజనానికి హాజరయ్యేందుకు కారులో బయలుదేరారు. బరంపురం నుంచి కొరాపుట్ వెళ్లేందుకు డ్రైవరు, మరొకరు మరో కారులో ప్రయాణిస్తున్నారు. స్థానిక హులువ సమీపంలోని ఆశీర్వాద్ దాబా వద్దకు వచ్చేసరికి రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో దమయంతి, రస్మిత, ఎస్.చిరంజీవి, పింటు పండాలకు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. దమయంతి, రస్మిత పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం కొరాపుట్ తరలించేందుకు సన్నహాలు చేస్తున్నారు.

సర్పంచ్‌లను కించపరచడం తగదు



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు

జయపురం: మహంగా శాసనసభ్యుడు శారదాప్రసాద్ ఈ నెల 3న విధానసభలో సర్పంచ్‌లను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని జయపురం సర్పంచ్‌ల సంఘం డిమాండ్ చేసింది. వారంలోగా వ్యాఖ్యలను ఉపసంహరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం జయపురం సమితి రొండాపల్లి పంచాయతీ కార్యాలయంలో సంఘ కార్యదర్శి ఆనంద హల్దా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు లోభ ముదులి మాట్లాడుతూ పంచాయతీ వార్షిక బడ్జెట్‌ను సర్పంచ్‌లు ఆమోదించిన తర్వాత బీడీఓ ఆమోదిస్తారని, ఈ ప్రక్రియలో అవినీతి జరుగుతోందని ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం తగదన్నారు. సమావేశంలో సంఘ ఉపాధ్యక్షుడు మోనందర గదబ తదితరులు పాల్గొన్నారు.

• ఫిజియోథెరపితో మేలు



మాట్లాడుతున్న సమర్థ్ చైర్‌పర్సన్ నిరంజన్ బెహరా

పర్లాకిమిడి: దివ్యాంగులకు ఫిజియోథెరపి ద్వారా అన్ని విధాలా మేలు కలుగుతుందని సమర్థ్ దివ్యాంగుల కేంద్రం చైర్‌పర్సన్ నిరంజన్ బెహరా అన్నారు. స్థానిక పాతపట్నం రోడ్డులో సెంటర్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సంస్థ కాన్ఫరెన్సు హాలులో నిర్వహించిన ఫిజియోథెరపి దినోత్సవ వేడుకలను జిల్లా శిశు సంరక్షణ సమితి అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి ప్రారంభించారు.

కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు మమతారాణి శతపతి, పండిత నర్సింగ గౌడో, సమర్థ్ కార్యదర్శి సంతోష్ కుమార్ మహారాణా, సీసీడీ బోర్డు సభ్యులు సంజయ్ జెన్నా, ఫిజియోథెరపిస్టు సరోజినీ రైతా పాల్గొన్నారు.

'కరిమి'కి పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు

శ్రీకాకుళం న్యూకాలనీ/కోటబొమ్మాళి: పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డును జిల్లాకు చెందిన కరిమి రాజేశ్వరరావు అందుకున్నారు. గుంటూరులో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈయన అవార్డును అందుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ లెక్చరర్-టీచర్స్ అసోసియేషన్‌తో పాటు 8 ప్రముఖ సామాజిక విద్యాసంస్థలతో కలిపి.. దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఉపాధ్యాయులు విద్యా సామాజిక రంగంలో చేసిన విశేష కృషికిగాను ఈ అవార్డును అందజేశా రు. అవార్డుతోపాటు ఘనంగా సత్కారం, ప్రశంసా పత్రా న్ని అందుకున్నారు. ఈయన జిల్లాలోని కొటబొమ్మాళి మండలం కురుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పాఠశాలలో సృజనాత్మక బోధనతో పాటు సోషల్ మీడియా ద్వారా ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ, వివిధ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని సామాజిక స్పృహలో భాగమైనందుకు ఈ అవార్డు లభించింది. ఈయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం రుంకు హనుమంతుపురం, భార్య సింధురి పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నారు.

సీఎం కిసాన్ యోజన ప్రారంభం



ప్రారంభోత్సవ సభలో సీఎం మోహన్‌చరణ్ మాఝీ

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆదివారం సంబల్‌పూర్‌లో నుఖాయ్ పండుగ సందర్భంగా సీఎం - కిసాన్ యోజనను ప్రారంభించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం - కిసాన్) యోజన కింద లబ్ధి పొందని రైతులకు ఆర్థిక సహాయం అందించడానికి ముఖ్యమంత్రి కిసాన్ యోజన ప్రారంభించారు. అర్హులైన రైతులకు రెండు విడతలుగా ఏడాదిలో మొత్తం రూ. 4,000 అందజేస్తారు. మొదటి విడతగా రూ. 2,000 నువాఖాయ్ సందర్భంగా పంపిణీ చేయగా, మిగిలిన రూ. 2,000 అక్షయ తృతీయ నాడు జమ చేయనున్నారు. సంబలపూర్ గంగాధర్ మెహెర్ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో వ్యవసాయం, రైతుల సాధికారత విభాగానికి చెందిన కృషక్ ఒడిశా యూనిఫైడ్ పోర్టల్‌ను కూడా సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలేని రైతులకు మూడు విడతలుగా రూ.12,500 మంజూరు చేస్తామన్నారు. ముందుగా సీఎం - కిసాన్ గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రెండు నెలల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 45,97,036 మంది బ్యాంకు ఖాతాలకు రూ. 925.40 కోట్లు పంపిణీ చేయనున్నామని వివరించారు.

సంబల్‌పూర్‌లో రెండో ఎయిమ్స్..

రాష్ట్రంలోని సంబల్‌పూర్‌లో రెండో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. పశ్చిమ ఒడిశాలో ప్రత్యేక ఆరోగ్య సేవల ఆవశ్యకతను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకువెళ్లిందని తెలిపారు. ఈ ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందన్నారు.కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రభుత్వ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రులు కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిదా తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమం వీక్షించారు.

సుభద్ర యోజనపై విస్తృత ప్రచారం

- ప్రచార రథాలను ప్రారంభించిన సీఎం, మంత్రులు, అధికారులు
- మహిళలకు అవగాహన కల్పించాలని సూచన



మల్కన్‌గిరి: ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ పాటేల్



భువనేశ్వర్: ప్రచార రథాలను ప్రారంభిస్తున్న సీఎం మోహన్‌చరణ్ మాఝీ

రాయగడ: మహిళల ఆర్థిక సాధికారతకు అమలు చేయనున్న 'సుభద్ర యోజన'పై విస్తృత ప్రచారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాయగడలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో 6 సుభద్ర యోజన ప్రచార రథాలను రాష్ట్ర వాణిజ్య, గనుల శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెన్నా ఆదివారం ప్రారంభించారు. ఈ పథకం కింద 21 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు ఐదేళ్లలో రూ.50 వేల ఆర్థిక సాయం అందుతుందని మంత్రి చెప్పారు. కలెక్టర్ ఫరూల్ పట్వారి మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వరకు 11 సమితుల్లో ప్రచారం చేయిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, ఎస్సీ, ఎస్టీ మోర్చా రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాళీరాం మాఝి తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సుభద్ర యోజన ప్రచార రథాన్ని నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి జెండా ఊపి రథం ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు. కొరాపుట్ కలెక్టరేట్ వద్ద రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గోండో జెండా ఊపి రథం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వీ.కీర్తివాసన్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, జెడ్పీ అధ్యక్షులు సస్మితా మెలకా పాల్గొన్నారు.

పర్లాకిమిడి: జిల్లా కలెక్టరేట్ వద్ద సుభద్ర పథకం ప్రచార రథాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జూలై 1 నాటికి 21 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు పథకం వర్తిస్తుందని చెప్పారు. రాఖీపూర్ణిమ, అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న రెండు విడతలుగా ఐదు వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ కార్య నిర్వాహక అధికారి గుణనిధి నాయక్, పురపాలక ఈఓ గౌరచంద్ర పట్నాయక్, మిషన్ శక్తి అధికారి టిమోన్ బోరా, జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి సరలా పాత్రో, జిల్లా సమాజ సంక్షేమ శాఖ అధికారి మనోరమాదేవి తదితరులు పాల్గొన్నారు. కాశీనగర్ సమితి ఖండవ పంచాయతీలో బీజేపీ నాయకుడు రొక్కం సతీష్ ఆధ్వర్యంలో దరఖాస్తులు పంపిణీ చేశారు.

మల్కన్‌గిరి: కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రచార రథాన్ని కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ ప్రారంభించారు.

భువనేశ్వర్: సుభద్ర అవగాహన రథాలను ముఖ్యమంత్రి మోహన్ మాఝీ స్థానిక గాంధీ మార్గ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సుభద్ర యోజనతో మహిళలకు ఆత్మ గౌరవం కలుగుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిదా మాట్లాడుతూ ఈ నెల 16 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య రథాలు పర్యటిస్తాయని చెప్పారు.



కొరాపుట్ : నబరంగ్‌పూర్‌లో ప్రచార రథం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి



రాయగడ: ప్రచార రథాలను ప్రారంభిస్తున్న మంత్రి జెన్నా, పక్కనే కలెక్టర్ పట్వారి



కొరాపుట్ కలెక్టరేట్ వద్ద పథకం వివరాలను వెల్లడిస్తున్న మంత్రి నిత్యానంద గోండో



పర్లాకిమిడి: ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

క్లుప్తంగా

జెడ్పీలో వినాయక సందడి

• పాల్గొన్న చైర్మన్ శ్రీనివాసరావు



గణపతికి తొలిపూజ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనువాసరావు, తదితరులు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం వినాయకచవితి సందడి నెలకొంది. స్వామివారికి తొలిపూజలో జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదంతా ఎటువంటి విఘ్నాలు లేకుండా ఉమ్మడి జిల్లా వాసులు ఆనందంగా ఆరోగ్యంగా ఉండేలా విఘ్నేశ్వరుడి ఆశీర్వాదం ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ పూజల్లో జెడ్పీ సీఈఓ ఎల్.ఎస్.వీ. శ్రీదర్‌రాజా పాల్గొన్నారు

10న అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

విజయనగరం రూరల్: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన అండర్ 14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి సీతారామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంలోని విజ్జి క్రికెట్ స్టేడియంలో జరిగే ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2010 సెప్టెంబర్ 1 తరువాత జన్మించినవారై ఉండాలని, అలాగే పోటీలకు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్స్, మూడేళ్ల మార్కుల జాబితా తీసుకుని హాజరుకావాలని చెప్పారు. ఎంపికలు నిర్వహించే రోజు ఉదయం 7గంటలకు తెలుపు రంగు దుస్తులతో పాటు సొంత క్రికెట్ కిట్‌తో హాజరు కావాలని కోరారు.

10న ఫైజర్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక

విజయనగరం ఫోర్ట్: మహారాజా కాలేజీ ఆఫ్ ఫార్మశీలో ఈనెల 10వతేదీ ఉదయం 9 గంటల నుంచి విశాఖపట్నానికి చెందిన ఫైజర్ ఫార్మా హెల్త్ కేర్ లిమిటెడ్ ఉద్యోగ ఎంపికలు నిర్వహిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. ఉదయ శంకర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కృష్ణంరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023, 2024లో డి ఫార్మశీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



రాంబాబు (ఫైల్)

బొండపల్లి: మండలంలోని కొండకిండాం గ్రామానికి చెందిన వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. దీనిపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కలిశెట్టి రాంబాబు(36) మద్యానికి బానిసై కొద్ది రోజులుగా ఎటువంటి పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటూ నిరంతరం తాగుతున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులు నిలదీయడంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో విజయనగరంలోని కేంద్రాస్పత్రికి కుటుంబసభ్యులు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవ పంచనామా నిర్వహించినట్లు ఎస్సై తెలియజేశారు.

తారాపురంలో మరో వ్యక్తి..



తవుడు మృతదేహం

రామభద్రపురం: మండలంలోని తారాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రేగు తవుడు (59) మద్యానికి బానిసై ప్రతి రోజూ తప్పతాగి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులు గట్టిగా మందలించడంతో మనస్తాపం చెంది శనివారం గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయమాడు. గమనించిన భార్య లక్ష్మి, కుమారుడు మహేష్ విజయనగరంలోని జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ రమణ కేసునమోదు చేశారు.


విక్రేతలు, కొనుగోలుదారులపై కేసులు నమోదు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

బొబ్బిలి: పట్టణంలోని సీబీఎం స్కూల్ విక్రేతలు, కొనుగోలుదారులపై కేసులు నమోదు చేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు పొట్నూరు శంకరరావు, ఎస్.గోపాలం, కోట అప్పన్నలు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలోని సీబీఎం పాఠశాల వద్ద ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎకరా 20 సెంట్ల భూమికి బదులు కోమటిపల్లిలో భూమిని కేటాయిస్తున్నట్లు రిజిస్ట్రేషన్‌లో చూపించడం చాలా దారుణమన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియకుండా ఈ రిజిస్ట్రేషన్ జరిగిందా అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు.

• ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాలు
• తుఫాన్ సమయంలోనూ వేటకు వెళ్లిన మత్స్యకారులు
• అతికష్టం మీద ఒడ్డుకు చేరిన బోట్లు
• తీరంలో జాడలేని రెవెన్యూ, మెరైన్ అధికారులు



ఉధృతంగా ప్రవహిస్తున్న చంపావతి నది



చింతపల్లిలో ఉధృతంగా వస్తున్న కెరటాలు

ఎడతెరిపి లేని వర్షం



చింతపల్లితీరంలో వేటకు వెళ్లి చేపలతో అతికష్టం మీద ఒడ్డుకు చేరిన మత్స్యకారులు

పూసపాటిరేగ:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఉపరితల ఆవర్తన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ఆదివారం సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగుసిపడుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కొత్త నీరు సముద్రంలో చేరడంతో కడలి అల్లకల్లోలంగా మారింది. అలల ఉధృతికి సముద్రం ముందుకు రావడంతో తీరం కొన్ని చోట్ల కోతకు గురైంది. తీరంలో ఉన్న పడవలు, వలలను మత్స్యాకారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మత్స్యా కారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని అధికారులు ఎటువంటి హెచ్చరికలు జారీ చేయకపోవడంతో చింతపల్లిలో కొంతమంది మత్స్యాకారులు సముద్రంలో చేపల వేటకు ఆదివారం వెళ్లారు. భారీవర్షాలు, గాలులు వీస్తుండడంతో రెవెన్యూ, మెరైన్ అధికారులు తీరంలో ఉండి మత్స్యాకారులను అప్రమత్తం చేయకపోవడంతో వారు యథావిధిగా వేటసాగించారు. తీర ప్రాంత గ్రామాలైన చింతపల్లి, పతివాడబర్రిపేట, తమ్మయ్యపాలెం, పులిగెడ్డ, తిప్పలవలస, కోనాడ గ్రామాల్లో మత్స్యాకారులు భారీ వర్షాల కారణంగా వారంతట వారే వేటను విరమించుకోగా కొంత మంది మాత్రం వేటను యథావిధిగి కొనసాగించారు. సముద్రాన్ని ఆనుకుని ఉన్న తిప్పలవలస, చింతపల్లి, పతివాడబర్రిపేట గ్రామాల మత్స్యకారులు భారీ వర్షాల ప్రభావంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

తుఫాన్లు వస్తే పస్తులే

తుఫాన్‌లు వచ్చినప్పుడు వేట సాగక జీవనోపాధికి ఇబ్బంది కలుగుతోందని పలువురు మత్స్యాకారులు వాపోతున్నారు. వాతావరణ పరిస్థితిపై అవగాహన కల్పించే వారే లేరని మరి కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసి లోతట్టు ప్రాంతాలు జలమయమైనా అధికారులు కనీసం పట్టించుకోలేదని పలువురు మత్స్యాకారులు చెబుతున్నారు. చింతపల్లిలో ఆదివారం కొంతమంది మత్స్యాకారులు యథావిధిగా చేపట వేట సాగించినా అధికారులు కనీసం పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

నెల్లిమర్ల: నియోజకవర్గం పరిధిలోని చంపావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నదిలో భారీగా వరదనీరు చేరింది. ముఖ్యంగా నది జన్మస్థలం ఆంధ్ర కొండల్లో వర్షం ఎక్కువగా కురవడంతో నిన్నటి వరకు నీరులేక వెలవెలబోయిన నది కళకళలాడుతోంది. ఎగువన ఉన్న గుర్ల గెడ్డ, గడి గెడ్డ, ఊట గెడ్డలోని నీరు నదిలో చేరడంతో నిండుగా ప్రవహిస్తోంది. వర్షం కురవడం ఇలాగే కొనసాగితే సోమవారం నాటికి నదిలో నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంది. అదే గనుక జరిగితే రామతీర్థం వైపు వెళ్లే రహదారిలోని వంతెన మునిగిపోయి, రాకపోకలు బంద్ అయ్యే ఆస్కారం ఉంది. ఇదిలా ఉంటే నదిని చూసేందుకు పట్టణవాసులు అధిక సంఖ్యలో వస్తున్నారు. నదిలో ఎవరూ దిగకుండా, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తహసీల్దార్ సుదర్శనరావు, నగర పంచాయతీ కమిషనర్ విశ్వేశ్వరరావు చర్యలు చేపట్టారు. నది వద్ద సిబ్బందిని కాపలాగా ఉంచారు.

బైక్‌ను కారు ఢీకొని వ్యక్తి మృతి



సతీష్ మృతదేహం

లక్కవరపుకోట: మండలంలోని అరకు-విశాఖ రోడ్డులో కొత్తగంగుబూడి జంక్షన్ సమీపంలో శనివారం జరిగిన ప్రమాదంలో గంగుబూడి గ్రామ మాజీ ఉపసర్పంచ్ లెంక సతీష్(45) మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై గోపాలరావు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారంలో పనిచేస్తున్న లెంక సతీష్ శనివారం మధ్యాహ్నం విధులు ముగించుకుని స్వగ్రామం గంగుబూడికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదే సమయంలో ఎస్.కోట నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు డ్రైవర్ ముందున్న మేకల మందను ఒక్కసారిగా కారు బ్రేకులు వేశాడు. దీంతో ఆ కారు వెనుకనే ద్విచక్రవాహనంపై వస్తున్న సతీష్ అదుపు తప్పి వెనుక నుంచి కారును బలంగా ఢీకొట్టి తుళ్లి రోడ్డుపై పడిపోగా తలకు తీవ్రమైన గాయమై అధిక రక్తస్రావం జరిగింది. వెంటనే కొత్తవలసలో గల ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సమాచారం అందుకున్న ఎల్.కోట ఎస్సై ఆర్.గోపాలరావు శవపంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, నాలుగు సంవత్సరాల పాప ఉన్నారుప

కారు ఢీకొని మరో వ్యక్తి..



అప్పలనాయుడు మృతదేహం

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామంలో జాతీయ రహదారి26ను ఆనుకుని ఉన్న ఇంటిపైకి వేగంగా దూసుకు వచ్చిన కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై యు.మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నిమ్మాది అప్పలనాయుడు(68) జాతీయ రహదారి పక్కన గల ఇంటి ముందు నిలబడి ఉండగా గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్న బొలెరో వాహనం వేగంగా వస్తూ అదుపు తప్పి ఇంటి ముందుకు దూసుకువచ్చి అక్కడ నిల్చున్న అప్పలనాయుడిని బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ..



ఇందిరమ్మ (ఫైల్)

సాలూరు రూరల్: మండలంలోని కందులపదం పంచాయతీ తీన్ సామంతవలస గ్రామానికి చెందిన సీదరపు ఇందిరమ్మ(50) విద్యుత్ షాక్‌తో మృతి శనివారం చెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మ ఇంట్లో సన్‌స్లేడ్‌కు ఉన్న ఐరన్ కొక్కాలకు వేలాడుతున్న ఇనుప వైరుపై ఆమె బట్టలు ఆరబెడుతున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైంది. వర్షాల కారణంగా ఇంటి శ్లాబ్ అంతా చెమ్మతో ఉండడంతో ఇల్లంతా పూర్తిగా విద్యుత్ సరఫరా కాగా ఆమె షాక్ తగిలి మృతిచెందింది. ఆ సమయంలో ఇంటిలో ఉన్న తన కూతురు కర్రతో కొట్టి షాక్‌నుండి తప్పించే ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకపోయింది.

ఉత్సవ కమిటీ సభ్యులదే పూర్తిబాధ్యత



గణపతి మంటపాల వద్ద పర్మిషన్‌లను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గణపతి మంటపాలను ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో పోలీసు అధికారులు, సిబ్బంది, శని,ఆదివారాల్లో సందర్శించి వాటి అనుమతులను పరిశీలించారు. ఉత్సవాలకు ఇంకనూ అనుమతులు పొందని వారికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఉత్సవాలు నిర్వహించేటప్పుడు పూర్తి బాధ్యత ఉత్సవ కమిటీ సభ్యులదేనని స్పష్టం చేశారు. ఉత్సవాల వల్ల ఆయా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మంటపాలను సందర్శించేందుకు వచ్చే భక్తుల వాహనాలను పార్కింగ్ చేసేందుకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని, ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ఉత్సవాల నిర్వహణ వల్ల స్థానికులు, ఇతర మతస్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్దిష్టమైన సౌండ్‌తో మాత్రమే మైకులను వినియోగించాలని సూచించారు. ఉత్సవాల వద్ద డీజేలు, అశ్లీల నృత్యాలు నిర్వహించరాదన్నారు. నిమజ్జనం నిర్వహించే సమయంలో మద్యం సేవించడం, కళ్లకు హాని కలిగించే రంగులు జల్లుకోవడం, బాణసంచా కాల్చడం చేయరాదన్నారు. నిమజ్జనం సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులే చర్యలు చేపట్టాలని కోరారు. విగ్రహాలను నిమజ్జనం చేసే చెరువులు, నదుల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని, గజఈతగాళ్లను నియమించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో రైలు ఢీకొని రాజాం పట్టణానికి చెందిన యువకుడు తలచింతల గౌరీశంకర్(37) మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో రెండో నంబర్ ప్లాట్‌ఫాంలో రైలు ఎక్కేందుకు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొన్నట్లు చెప్పారు. గౌరీశంకర్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 6న రాజాం వచ్చిన ఆయన తిరిగి శనివారం హైదరాబాద్‌కు పయనమయ్యాడు. రైల్వేస్టేషన్‌లో టిక్కెట్ కొనుక్కుని రెండో నంబర్ ప్లాట్‌ఫాంలో రైలు ఎక్కేందుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మృతుడు గౌరీశంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి దుర్మరణం చెందడంతో భార్యాపిల్లలు, మృతుడి తల్లిదండ్రులు భోరున విలపించారు. ప్రమాద దృశ్యాన్ని వీక్షించిన స్థానికులు, రైల్వే స్టేషన్ సిబ్బంది కళ్లు చెమర్చాయి.

అంతర్ జిల్లాల బీబీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

తెర్లాం: అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక ఆదివారం తెర్లాం మండలంలోని నెమలాం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగింది. ఈ నెల 13 నుంచి 15వరకు అన్నవరంలో జరగనున్న అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా నుంచి పాల్గొననున్న బాలురు, బాలికల జట్లకు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ జి.సుందరరావు ఆధ్వర్యంలో 24మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో చైర్మన్ జి.సుందరరావు మాట్లాడుతూ అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు బాగా రాణించాలని కోరారు. బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపికకు పీడీలు జి.సింహాచలం, సతీష్, నాగమణి, రామినాయుడు హాజరయ్యారు.

డ్రాగన్ ఫ్రూట్స్.. విటమిన్స్ ఫుల్

• రైతుకు లాభం..వినియోగదారులకు ఆరోగ్యం
• మార్కెట్‌లో భలే గిరాకీ



పసుకుడి వద్ద అమ్మకానికి సిద్ధం చేసిన డ్రాగన్ ఫ్రూట్స్



తాలాడలో డ్రాగన్ పంట

భామిని: విదేశాల్లో సంపన్నులు తినే డ్రాగన్ ఫ్రూట్‌ను చూడడమే అరుదు. అలాంటి పంట సాగుపై పార్వతీపురం మన్యం జిల్లాలోని ఔత్సాహిక రైతులు దృష్టిపెట్టి సాగు చేస్తుండడం ప్రత్యేకత సంతరించుకుంటోంది. సంప్రదాయ పంటలకు భిన్నంగా యువ రైతులు వాణిజ్య పండ్ల తోటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఆరోగ్యాన్నిచ్చే పండ్ల తోటల పెంపకంతో అధికాదాయం దిశగా సాగుతున్నారు. మార్కెటింగ్ వ్యూహాన్ని పసిగట్టి ఆర్థికంగా వెసులుబాటు ఉన్న రైతులు డ్రాగన్‌ఫ్రూట్ సాగు వైపు రావాలని జిల్లా ఉద్యాన శాఖాధికారులు పిలుపునిస్తున్నారు.

జిల్లాలో విస్తారంగా సాగు ..

భామిని, పార్వతీపురం, కురుపాం, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, సాలురు, మక్కువ ప్రాంతాల్లో డ్రాగన్ సాగవుతోంది. ఆరంభంలో అధిక పెట్టుబడి కావడంతో పెద్ద రైతులు కొంత భూమిలో వాణిజ్య పంటగా సాగు చేస్తున్నారు. ముందుగా తక్కువ విస్తీర్ణంలో డ్రాగన్ తోటలు నాటుతున్నారు. మార్కెట్‌లో వినియోగం పెరుగుదలకు తగ్గట్లు విస్తీర్ణం పెంచడానికి రైతులు యోచిస్తున్నారు. ఉద్యానవన శాఖ ద్వారా ఎకరాకి రూ.1 లక్ష వరకు మాత్రమే రాయితీ ఇస్తున్నారు. డ్రాగన్ పండ్ల తోటల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధికంగా దిగుబడులు, లాభాలు ఆర్జించవచ్చని ఉద్యాన వన శాఖాధికారులు చెబుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలు..

డ్రాగన్ ఫ్రూట్ చెట్టును వాడుక భాషలో సిరి జమ్మెడ చెట్టు అంటారు. ఇది ఎడారి జాతికి చెందిన పండ్ల మొక్క. ఈ పండులో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. డ్రాగన్ ఫ్రూట్‌ను సుగర్ వ్యాధిగస్తులు యథేచ్ఛగా తినవచ్చు. ఇందులో చక్కర శాతం తక్కువగా ఉండడంతో మధుమేహ బాధితులు తినవచ్చని వైద్యులు చెబుతున్నారు. అంతే కాకుండా ఈ ఫ్రూట్‌లో శరీరానికి అవసరమైన యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ ఉంటాయి.ఈ పండును తినడం ద్వారా బరువు నియంత్రణ, అస్తమా, చెడు కొలెస్ట్రాల్ తగ్గడం, డయాబెటిస్ నియంత్రణ లాంటి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి.

అన్ని రకాల నేలలు అనుకూలం..

డ్రాగన్ ఫ్రూట్‌ను పండించేందుకు అన్ని రకాలైన నేలలు అనుకూలం. ముఖ్యంగా మంచి సేంద్రియ కర్బనంతో కూడిన ఇసుక నేలలు మరింత శ్రేష్ఠం. ఈ పంటకు నీటి అవసరం చాలా తక్కువ. పూత, కాయ సమయాల్లో 3-4 తడులు అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. ఇందులో మూడు రకాలు ఉన్నాయి. వైట్ ఫ్లాష్ డ్రాగన్, రెడ్ ఫ్లాష్ డ్రాగన్, ఎల్లో ఫ్లాస్ డ్రాగన్ రకాలు ఉన్నాయి.

20 ఏళ్ల పాటు దిగుబడి

ఈ పంట ఒకసారి నాటితే 20 సంవత్సరాల వరకు పంట దిగుబడిని ఇస్తుంది. స్తంభానికి నలు దిక్కులా 2అడుగుల పొడవు, వెడల్పు 1 అడుగు లోతు గుంతలు తవ్వాలి. గుంతలో 25 కిలోల పశువుల ఎరువు, కిలో వేపపిండి వేసి మొక్కలు నాటాలి. నేలను బట్టి సాగు చేసిన రకాలను బట్టి తడులను ఇవ్వాలి.నీరు ఎక్కువైతే మొక్కలు చనిపోయే ప్రమాదం ఉంది. ఏడాదిలో రెండు సార్లు జూన్-జనవరి నెలల్లో పశువుల ఎరువు వేసి సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. సాధారణంగా డ్రాగన్ మొక్కలు తొలికాపు కాయడానికి రెండు నుంచి మూడు సంవత్సరాల సమయం పడుతుంది. డ్రాగన్ సాగుకు ఎకరాకి రూ.3లక్షల నుంచి రూ.4లక్షలు ఖర్చు అవుతుంది. ఎకరాకి దిగుబడి 6 నుంచి 8 టన్నుల వరకు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్ కేజీ ధర రూ.200 నుంచి రూ.250 పలుకుతోంది.

దిగుబడి బాగుంది..

డ్రాగన్ పంట సాగును తక్కువ స్థలంలో చేపట్టాం. అర ఎకరాలో పంట వేశాం. ఏడాది పొడవునా నాలుగు కాపులు వస్తోంది. ఒక్కో కాపు సమయంలో రూ.40వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం వస్తోంది. దిగుబడి పెరిగితే మరింత విస్తరిస్తాం. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం పెంచితే ఇంకా మంచిది. పంట నిర్వహణ సులభంగా ఉంది.

సానుబిల్లి రాజేంద్ర నాయుడు, రైతు, పసుకుడి, భామిని మండలం

లక్ష వరకు రాయితీ..

డ్రాగన్ పంట సాగు ఆరంభంలో పెట్టుబడి ఎక్కువ. ఉద్యాన వన శాఖ నుంచి ఎకరాకి రూ.1 లక్ష వరకు రాయితీ అందుతుంది. సాంకేతిక సహాయం అందిస్తాం. ఇది 20 ఏళ్ల వరకు ఆదాయం వచ్చే వాణిజ్య పంట, ఆరంభంలో కాస్తా ఎక్కువ పెట్టుబడి. తరువాత ఆదాయం నిరంతరం పెరుగుతూ ఉంటుంది. ప్రత్యామ్నాయ పంటగా సాగు చేయవచ్చు.

పేడాడ జయశ్రీ, ఉద్యాన వన అధికారి, ఐటీడీఏ, సీతంపేట

కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

• కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: అల్పపీడనం వల్ల రాబోయే రెండు రోజులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం జిల్లా, మండల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఆదివారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 08963 293046ను ఏర్పాటు చేశామన్నారు. అలాగే పార్వతీపురం, పాలకొండ రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మండలాల్లో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న భవనాలలో ఎవరూ ఉండరాదని, వారిని తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. కొండ శిఖర గ్రామాల పరిస్థితిని గమనించి వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా వినాయక నిమజ్జనం చేసే సమయంలో తగు జాగ్రత్తలు, సూచనలు తెలియజేయాలని ఆదేశించారు. ఒడిశాలో భారీ వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆకస్మికంగా వరదలు వచ్చే సమయంలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతారని, అటువంటి ప్రదేశాల్లో పోలీసులు, వలంటీర్లు లేదా ఇతరులను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ఆదేశించారు.

సెల్ఫీలు దిగవద్దు

పంచాయతీరాజ్, ఇరిగేషన్ సిబ్బంది చెరువులు, ఆనకట్టలు తనిఖీ చేయాలని, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, గేట్లు, లాకులు తనిఖీ చేసి సక్రమంగా పనిచేసేటట్లు చూడాలని, అవుట్ ఫ్లో సక్రమంగా ఉండే విధంగా చూడాలని స్పష్టం చేశారు. వానలు కురిసేటపుడు సెల్ఫీలు తీసుకోవడానికి, వరదల్లో ఈత కొట్టడానికి ఎవరూ ప్రయత్నించవద్దని పిలుపునిచ్చారు. వాతావరణశాఖ హెచ్చరికల మేరకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, ఎటువంటి దుర్ఘటనలు సంభవించరాదన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి. కేశవ నాయుడు, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

బిత్రపాడు పంటపొలాల్లోనే ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, బట్లభద్ర,నిమ్మలపాడు పంట పొలాల్లో ఏనుగులు ఆదివారం ఉదయం దర్శనమిచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పామాయిల్ తోటలో ఉండి గుమ్మడిగెడ్డ వాగులోకి జారుకున్నాయి. సాయంత్రానికి నిమ్మలపాడు నుంచి బిత్రపాడు పరిసర ప్రాంతాల్లోకి వచ్చాయి. చీకటి పడిన సమయంలో మళ్లీ గ్రామంలోకి ఏనుగులు వస్తాయని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అటవీ సిబ్బంది వాటిని తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.



పంట పొలాల్లో ఏనుగులు